కళోద్ధరణము

విశ్వనాథకవిరాజు

"లోకస్య చరితం నాట్యమ్"

౧

మృచ్ఛకటికము తెనుగునటునిచేతి కిచ్చిన అత డది ప్రయోగార్హము కాదని త్రోసివైచును. రత్నావళిని ఆంధ్రనాటకప్రియునిచేతి కిచ్చిన అత డది చింతామణిమాత్రమైనను హృదయంగమముగా లేదనును. పూర్వపద్ధతిని ఆంధ్రవిద్యార్థి గురువునొద్ద సంస్కృతముద్రారాక్షసమును చదువుచున్నపుడు దానిని తా నింతకుమున్ను చదివిన కాదంబర్యాదిశ్రవ్యకావ్యములతో సమముగనే చూచుకొనునుకాని విశేషానందమును బొందడు. ఇంక పూర్వపండితులు వ్రాసిన సంస్కృతనాటక వ్యాఖ్యానముల బరిశీలించిన అవి శ్రవ్యకావ్యవ్యాఖ్యానములకంటె అంతగా భిన్నములై యుండవు. పై విషయములను పర్యాలోచింపగా సంస్కృతనాటకముల విశిష్టత యేమి యనుసందేహము కలుగక మానదు.

దృశ్యకావ్యములు శ్రవ్యకావ్యములకంటె మిక్కిలి ప్రాచీనములు—ఆదికావ్యమగు రామాయణమునందును నాటకప్రశంస యుండుటచేత. శ్రవ్యకావ్యములకంటె దృశ్యకావ్యములకే ముందు లక్షణ మేర్పడినది—అమరమున నాట్యవర్గు కలదుగాని కావ్యవర్గు లేదు. భారతదేశమున నాట్యకళ వేదవిద్య యంత ప్రాచీనమని కొంద రనుచున్నారు. ఎట్లయినను భారతీయనాట్యవిద్య వయసు నాలుగయిదువేలయేండ్లనియైనను ఒప్పుకొనవలసియుండును.

అనేకకారణములచే మొదటి రెండుమూడువేల యేండ్లలో పుట్టిన నాటకము లన్నియును కాలగర్భమున బడి అణగిపోయినవి. భరతప్రోక్తనాట్యవిధానముం బట్టియు, శూద్రకకాళిదాసప్రదర్శిత నాట్యస్వరూపముంబట్టియు నేను సంస్కృతనాటక వాఙ్మయమును నాలుగువిధములుగ విభజింపగల్గితిని. అందు మొదటిరెండుభాగములును మనకు సంపూర్ణముగ నష్టమైనవి. మూడవభాగము తుట్టతుదిని గన్పట్టిన శూద్రకభాసమహాకవుల రూపకములు మాత్రము మిగిలియున్నవి. నాల్గవయుగము కాళిదాసునితో ప్రారంభమైనది. రమారమి ఐదు శతాబ్దములక్రిందట సంస్కృతనాటకరచన అంతమైనది. ఈ పదిపదునేనువందల

యేండ్లలో నెన్నినాటకము లుదయించినవోగాని రమారమి యేడెనిమిదివందల పేర్లు వినవచ్చుచున్నవి. రెండువందలు ప్రకటితమైనవి. ఒకవంద యింకను వ్రాతలోనే యున్నవి. ఇం దనేకనాటకములు పాశ్చాత్యలోకమున మిక్కిలి ప్రశంసింపబడుచున్నవి. భారతీయవిద్వాంసులకును వానియందు విశేషగౌరవము కలదు. ప్రజాసామాన్యమునకు వాని గొప్పదన మంతగా తెలియదు. ఇదేకారణముగా ఆనాటకములవలన మన తెనుగునాటకములను పోషించుకొనుట కంతయవకాశ మేర్పడకయున్నది. నాటకము ప్రయోగానుకూలముగా లేదు అన్నమాత్రమున దాని సౌష్ఠవమునకు భంగము కల్గునా? మాటవరుసకు—నేటి యాంధ్రరంగస్థలమునకు సంస్కృతనాటకములు ఎంత అననుకూలములో షేక్స్పియర్ నాటకములును, నేటి 'షా' నాటకములును, ఇంతేల, రవీంద్రుని నాటకములునుకూడ అంత అననుకూలములే. సంస్కృతనాటకములు పఠనమునగూడ నంత రంజింపకున్నవన్న పై పేర్లనే మరల నుదాహరింపవలసివచ్చును. వానినిమాత్రము అందరును అర్థముచేసికొని ఆనందింపగల్గుచున్నారా? అదృష్టవంతులు కొందరికే ఆభాగ్యము. అయిన నాటకముల యుత్తమత్వము ఎట్లు నిర్ధారణచేయవచ్చుననునపుడు ౧. అవి లోకమున గల్గించిన మార్పు, ౨. వాని స్థిరత్వము, ౩. వానిపై కళాభిజ్ఞులకు గల సదభిప్రాయము గడనకు తీసికొనవలసియుండును. పైగుణములు సంస్కృతనాటకములలో విశేషముగ గానవచ్చుటచే వాని విశిష్టత అంగీకరింపవలసియే యున్నది.

దేశకాలములనుబట్టి యెట్టి సుస్థిరపదార్థములకైనను గౌరవాగౌరవములు కలుగుచుండును. అది ప్రజల యభిరుచులనుబట్టియు, వారి పరిస్థితులనుబట్టియు గూడ నుండును. షేక్స్పియర్ కాలమునకంటె నేడు ఇంగ్లాండు వేయంతలుగ అభివృద్ధిచెందినను షేక్స్పియర్ గ్రంథములపై వ్యాఖ్యానములును, తదనుగుణముగ ఆతనిపై భక్తిప్రపత్తులును గూడ వేయంతలుగ ప్రబలిపోయినను ఆతని నాటకములు ఇప్పు డింగ్లాండులోగూడ నాడబడుచుండుటలేదు. అయినను ఇందనుక ఇంగ్లీషులో వెలువడుచున్న నాటకములన్నింటిలోను కొంతవఱకు షేక్స్పియర్ భిక్ష కన్పట్టుచునేయుండును. అది వారి కపకర్షగాదు; విశేషించి యుత్కర్షయే యగును. అట్లే అవసరమునుబట్టియు,అవకాశమునుబట్టియు సంస్కృతనాటక కళావిశేషముల గ్రహించిన ఆంధ్రనాటకకళయు వన్నెకెక్కగలదు. సంస్కృతనాటకములే యననేల, యేభాషలోని యుత్తమగ్రంథములైనను అనుసరింపదగినవే యగును—గుణ మనుసరణీయమగుటవలన. అయినను

సంస్కృతనాటకముల సన్నిహితత్వముచే దీనికి విషయప్రాధాన్య మొసంగబడుచున్నది.

౨

ప్రథమదర్శనమున మన హృదయమున హత్తుకొనునది యేవస్తువుయొక్కగాని బహిరాకారము. కాలముతోబాటుగ ఆకారమును మార్పుచెందుచుండును. సంస్కృతరూపకములలో నాటకాది దశవిధములునుగాక, నాటికాద్యష్టాదశవిధములునుగాక చైత్రకాదు లింకెన్నివిధములో పొడగట్టుచుండును. ఏకభాషా గ్రంథములలోనే యింత ఆకృతిభేదము కలుగుటకు ప్రజల యభిరుచులే కారణమైయుండును. నాటకస్వరూపమును మార్చుటలో ప్రధానశక్తి నాట్యరంగమునకు గలదు. ఎంతగుణవంతములైయున్నను షేక్స్పియర్‌నాటకము లిప్పుడు ప్రయోగానర్హములగుటకు కారణము నాటి నాట్యరంగము మారిపోవుటయే. మూడువందల యేండ్లలోనే ఇంగ్లాండులో నింతమార్పు గల్గినపుడు మూడువేలయేండ్లలో భారతదేశములో నెంతమార్పు కలిగియుండదు! మృచ్ఛకటికము నాడిన రంగస్థలమున భాసుని దూతవాక్య మాడుటకు వీలుపడదు. కాళిదాసుని విక్రమోర్వశీయమాడిన రంగస్థలమున మురారియనర్ఘరాఘవము ప్రవర్తించుట కవకాశముండదు. ఆయుగములోనే రంగస్థల మెంతెంతో మారిమారి యెన్నెన్నోరూపములు గొనుచుండెను. ఇపుడు మనకన్నవో రంగస్థలము (Theatre) ఒకటియున్నదాయని సందేహము. ఉన్న దీని స్వరూపమేదియని ప్రశ్న.

ఎట్లయినను నేటి ఆంధ్రరంగస్థలమునకును, పూర్వపు సంస్కృతనాటకరంగస్థలములలో వేనికిని సంబంధము లేదనునది సిద్ధాంతము. అట్టియెడ తద్బహిరాకారమును అనుకరించినయెడల ప్రయోజన ముండదు. అది యసాధ్యము గూడ. ఇంక నాటకమునకు శరీరమగు ఇతివృత్తమును గమనించిన అదియు కాలమునుబట్టియు, ప్రజాభిరుచులనుబట్టియు మారుచునే యుండును. అవి 'నావిష్ణుః పృథివీపతిః' దినములు. ప్రభులీలలు వారికి విష్ణులీలలు, కృష్ణలీలలు. ఇప్పుడును మన దేశమున అయిదవభాగము స్వతంత్రప్రభుపాలితమైనను పాలకపాలితులకు తొల్లిటి యనుబంధములుమాత్రము లేవు. ప్రజల జీవితములు పాలనభారమున క్రుంగుచున్నను, ప్రజలభావములు స్వాతంత్ర్యాకాంక్షను మిన్నుముట్టుచున్నవి. ఇట్టియెడ వారి లీలావిలాసములు, వారి శృంగారగాథలు వీరికి ప్రశంసనీయములుగావు. ఈదినములలో రాజ నాయకములగు నాటకములకంటె ధీరనాయక

ములే ప్రియతరములు. కావుననే రాజనాయకములగు శృంగారనాటకముల వాసనయు నిపుడు గిట్టకున్నది.

సంస్కృతనాటకప్రపంచము కడువిశాలమైనదని మొదటనే విన్నవించి యుంటిని. ఇందు రాజనాయకములే గాక విప్రవణిజ్నాయకములును, ధూర్త ప్రాకృతనాయకములును, తుదకు పాషండరక్షఃపిశాచనాయకములునుగూడ గలవు. అట్టి రూపకములు కవిత్వముచే గాకున్న ఇతివృత్తముచే కొంత మనకు ఆనందమును గల్గించుచుండును. నాటికిని నేటికిని జీవనవిధానమునందయిననేమి, మతనైతికసాంఘిక రాజకీయ పరిస్థితులయందైననేమి బ్రహ్మాండమంత భేద మున్నది. కావున ఆవిషయము లనుకూలపడకున్నను ఆపరిస్థితులు బాగుగా అనుకూలపడగలవు.

3

ఏసందర్భమునందైనను బాహ్యానుకరణమువలన విశేషప్రయోజన ముండదు. ఆంతర్యమును గ్రహించి అనుకరించుటయే ప్రశంసనీయము. సంస్కృత నాటకసందర్భమునగూడ స్వరూపానుకరణముకంటె స్వభావానుకరణమే సర్వదా కొనియాడదగినది. అదియే దివ్యామృతమై మన ఆంధ్రనాటకకళను, తన్మూల మున మనలను సముద్ధరించునది. తొలుదొల్త లోకమున గ్రామ్యధర్మము ప్రవ ర్తిల్లునపుడు ధర్మసంస్థాపనకుగా నాటకము సృష్టింపబడినట్లు భరతముని చెప్పి యున్నాడు. కొంతకాలమునకు దేశము నిర్బాధకమై శాంతియుతమైనపుడు ప్రభువులును, పండితులును నాటకమును విలాసార్థముగ నుపయోగించుకొనుచు వచ్చిరి. అందైనను వారు ధర్మము నతిక్రమించినదిలేదు. వారు శృంగారప్రధాన ముగ వేలకొలది నాటకముల సృష్టించికొనిరేకాని అందొక్కదానియందైనను ధర్మవ్యతిక్రమము గానరాదు. కామశృంగారమును దూషించిరి; ధర్మశృంగార మునే భూషించిరి. 'అద్వైతం సుఖదుఃఖయోః' అను భవభూతివాణి దీనికి తార్కాణ. ఇప్పుడు మరల గ్రామ్యధర్మము ప్రవర్తిల్లుచున్నది. ప్రజాసామాన్య మును అజ్ఞానహతమై యున్నది. కావున నాటకకళను కేవలము విలాసార్థమేగాక ఉపదేశముకొఱకు గూడ వినియోగించిన సమంజసముగా నుండును. అందు ధర్మ ప్రతిపాదనమే ప్రధానలక్ష్యముగా నుండవలెను. నాట్యకళ ప్రజాసామాన్యముకొఱ కేర్పడినది గాన సౌలభ్యము ప్రథమగణ్యము. నేడు కొందరు గూఢార్థముగా నాటకములు వ్రాయుచున్నారు. ఒకసారి విన్నమాత్రముననే నాటకము గ్రహింప దగియుండవలెను. కావున శాస్త్రమువలె దుర్జ్ఞేయభావములతోను, దుర్భేద్య శబ్దార్థములతోను పూరింపక లలితపదబంధములతో రసవంతముగా రచింపవలసి

యున్నది. నేటి నాటకములలో నూతనసిద్ధాంతములపేరిట ధర్మమును తారుమారుచేయు అనేకవైదేశికదూరాచారములు జొన్పబడుచున్నవి. అవియు సంస్కృతనాటకాదర్శమున విశేషప్రయత్నమున వారింపబడవలెను. వధలు, చుంబనాలింగనాదులు మొదలగు రంగవర్జ్యములు అనేకములు నేడు బాహాటముగ ప్రదర్శింపబడుచున్నవి. చుంబనాలింగనాదులకు సినీమాప్రదర్శనములు సంపూర్ణాధికారము నొసంగినవి. వధాదులకు పాశ్చాత్యనాటకములు సంపూర్ణాధికారము నొసంగినవి. తండ్రియు కుమార్తెయును, తల్లియు కుమారుడును, అన్నదమ్ములు నక్కసెల్లెండ్రును గూర్చుండి చూచియానందింపదగిన దగుటచే నాటకమునందు చుంబనాదికము వర్జింపదగినది. వధ గర్హణీయము. ఆత్మవధ యింకను విశేషించి. జీవితమున నెట్టిదుస్సహాపరిస్థితు లేర్పడినను వాని కోర్చుకొని నిల్వగల ధీరతయే యుపదేశింపవలయును; మేకవలె లొంగి తానై మృత్యువును శరణువేడు భీరుత్వ మున్మూలింపవలెను. ఆత్మవధ కావ్యములందును, కార్యములందును కూడ విశ్వరూపమును పొందుచున్నది. ఇదియు వారింపదగినది.

సంస్కృతనాటకవాఙ్మయమునుండి జగత్తునందలి యితరవాఙ్మయములన్నియు గ్రహింపవలసిన ప్రధానభావము పవిత్రత. ఇందు ప్రహసనాదులలో తక్క తక్కినశాఖలయందు పరోఢ నాయికగాదు. అధర్మమునకు విజయము లేదు. ఈనియమముతో ప్రజానురంజన ప్రతిజ్ఞ నెరవేర్చుకొన్న వాఙ్మయములు అల్పసంఖ్యాకములు. ప్రాకృతులకు ధర్మాతిక్రమణమున ఒకవిధమగు సహజాభిరుచి యుండును. నీతిబోధకంటె అవినీతివిస్తృతి సద్యస్సంతోషమును గూర్చును. భీముడు ధర్మజుని యాజ్ఞకు లొంగి అణగియుండునప్పటికంటె జూదమాడినయాతని బాహుశాఖను ఖండింతునని ఆతనిపైకి బోవునపుడే జనమునకానందము. వివాహరంగముకంటె వివాహమోక్షణరంగము వారి కధికోత్సాహమును కల్గించును. లోకుల చెడురుచుల తప్పించుటకుమారు క్షణికయశస్సునభిలషించి వానిని పోషించు కవి మహాపాతక మొనర్చుచున్నాడు.

కథాసందర్భమున విస్మరింపరాని విషయ మింకొక్కటి గలదు—నాటకమునందలి కవిత్వము. కవిత్వము అభినయప్రధానమైన నాటకస్వభావమునకు ప్రతికూలమైనదే. ఈవిషయమును మన యాలంకారికులును అంగీకరించియున్నారు. కాని వర్ణనాదిక రూపమున కవిత్వమునకు నాటకమునను ప్రవేశము గల్గించిన దాని కభినేయతతోపాటు శ్రవ్యతయు కల్గునని మన సంస్కృత నాటకకర్తలు తలంచియుండిరి. భాసుని రచనలలో కవిత్వప్రాధాన్యము లేదు. కాళి

దాసు కవిత్వజీవియేయైనను తననాటకములలో వర్ణనలను స్వభావసిద్ధముగను, రసపోషకములుగనే తావిచ్చి యుంచెను. తరువాతికవులు—అప్పటికి నాటకమున కభినయసౌభాగ్య మంతరించుటచేకాబోలు—నాటకములను కవిత్వప్రధానముల నొనర్చిరి. కవిత్వముతోపాటు సంగీతము, నృత్యముగూడ సంస్కృతనాటకముల కంగములుగా నుండెను. ఇది కేవలము ప్రజాభిరుచులపై నాధారపడియున్న విషయము. ఎట్లయినను నిర్బాధకములగు ప్రజాభిరుచులపట్ల కవులు ప్రజల ననుసరించిన తప్పులేదు. ఒక్కొకపు డామాధుర్యమును చవిచూపవచ్చును. మొన్నమొన్ననేగదా టాగూరువారు నృత్యగానప్రధానమగు "శాపవిమోచనము"ను ఆంధ్రులకు పరిచితమొనర్చినారు!

౪

విషయ మతివిపులమైనది. పరిమితస్థలములో దీనిని విస్తరించి వివరింపగల్గుటయు కష్టసాధ్యము. అనేకు లీవిషయమును పరిశోధించి విశేషములను సోపపత్తికముగా ప్రకటించుచువచ్చిన కొంతకాలమునకు దీనిప్రయోజనము తెలియనగును; మరికొంతకాలమునకు తత్ఫల మనుభవమునకువచ్చును. నాటకకర్తలు తప్పక సంస్కృతనాటక వాఙ్మయమును సవిమర్శకముగా పఠింపనేవలసి యున్నది. "కావ్యరచనకు ప్రతిభయే ప్రధానము, మా కీయభ్యాసముతో ప్రసక్తియేమి?" అనువారికి జవాబుచెప్పవలసినది లేదు. అందరును పైతృకములగు సంపద్వైభవములను వదలి స్వతంత్రించి యున్నతజీవితములను గడపజాలరు.

"సమస్తమును సంస్కృతనాటకవాఙ్మయముననే యున్నది. అదితప్ప జగమున కింకొకశరణ్యము లేదు. అందలి ప్రత్యక్షరము నమూల్యము" అని దానిని మక్కికి మక్కిగా తెనుగులోనికి తెచ్చికొను నుత్సాహమునుగూడ ప్రశంసింపజాలను. తు, చ, తప్పక పద్యమునకు పద్యము, ప్రత్యయములను మాత్రము మార్చి వచనమునకు వచనము—భట్టా! వయస్య! ఆర్యపుత్రా! భర్తృదారికా! హలే! హఞ్జే! హండే!—అని వ్రాయుటయు తగదు. ఇష్టమైన ఆకథలను దీసికొనవచ్చును, అందలి భావములు గ్రహింపవచ్చును. రసపోషణపద్ధతి ననుసరింపవచ్చును, కళానైపుణి ప్రతిబింబింపజేయవచ్చును. ఇంతయు లోకధర్మమునకుగాని, కళాధర్మమునకుగాని భంగకరము గాకుండునట్లు ప్రజాభిరుచి ననుసరించియే చేయవచ్చును. నాటకము తేనెతో కలిపియిచ్చు నౌషధము.

http://www.maganti.org/

Source: Press Academy Website, Natya Kala, Dec 1934

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan